క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మైలవరం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. సంధ్యారాణి అన్నారు. పుల్లూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించి ఆమె మాట్లాడారు. తుపాను నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని జాగ్రత్తగా పట్టాలతో భద్రపర్చుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

గోశాలకు రూ. లక్ష విరాళం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో గోశాల షెడ్డు నిర్మాణానికి భక్తులు శనివారం రూ. లక్ష విరాళంగా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లికి చెందిన దివంగత ఎల్. కృష్ణకుమారి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె నడిపల్లి విజయ పూర్ణిమ, కుమారుడు ఎల్. శ్రీనివాసరావులు ఈ మొత్తాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. స్వామి దర్శనం అనంతరం దాతలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

ఏపీ జెన్‌కో ఉద్యోగికి పీహెచ్‌డీ ప్రదానం



ఇబ్రహీంపట్నం: ఏపీ జెన్‌కో శిక్షణా కేంద్రంలో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ కెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉలవపల్లి గంగాధరరెడ్డికి కోనేరు లక్ష్మయ్య ఇంజినీరింగ్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. యూనివర్సిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకున్నారు. జీవ రసాయన పద్ధతుల ద్వారా ఇంధన నాణ్యతను పెంచేందుకు గంగాధరరెడ్డి చేసిన పరిశోధనలకు గాను ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా జెన్‌కో శిక్షణా సంస్థ చీఫ్ ఇంజినీర్ బొద్దు శ్రీధర్, ఇతర ఉద్యోగులు ఆయనను అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు: సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ పి.సత్య శ్రీనివాస్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ శనివారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఏపీకే ఫైల్స్‌ను, లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ఎవరైనా వీడియో కాల్స్ చేసి డిజిటల్ అరెస్టు అంటూ బెదిరిస్తే నమ్మొద్దని, నిజమైన పోలీసులు డిజిటల్ అరెస్టులు చేయరని చెప్పారు. సోషల్ మీడియాను ఇష్టం వచ్చిన విధంగా వాడితే సైబర్ నేరాలకు గురవుతారన్నారు. ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుల విహార యాత్ర

తిరువూరు: స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు ఉత్తరాంధ్ర జిల్లాల విహార యాత్రకు శనివారం వెళ్లారు. విశాఖపట్నం, అరకులోయ తదితర ప్రాంతాల్లో గిరిజనుల సంప్రదాయాలు, కళలు, జీవన విధానంపై అధ్యాపకులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు యాత్రలో పాల్గొన్నారు.

లైన్‌తండాలో వరి కుప్ప దగ్ధం

నూజివీడు: మండలంలోని లైన్‌తండాలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వరి కుప్పకు నిప్పు పెట్టడంతో పంట మొత్తం కాలిబూడిదైంది. గ్రామానికి చెందిన వడిత్యా బాలు తనకున్న ఎకరం పొలంలో వరి సాగు చేసి ఇటీవలే కోత కోసి వరి కుప్ప వేశాడు. బాలు తెల్లవారు జామున పొలంలోకి వెళ్లగా వరి కుప్ప తగలబడుతూ ఉంది. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చేసరికి వరి కుప్ప పూర్తిగా దగ్ధమైంది. దీంతో రైతుకు దాదాపు రూ.30 వేల నష్టం వాటిల్లింది.

సభ పోస్టర్ల ఆవిష్కరణ

ఆగిరిపల్లి: మాదిగల ఆత్మీయ కలయిక, బహిరంగ సభను విజయవంతం చేయాలని సర్పంచ్ చొటపల్లి లక్ష్మి అన్నారు. ఆగిరిపల్లిలో మాదిగల ఆత్మీయ కలయిక బహిరంగ సభ పోస్టర్‌ను సర్పంచ్ తదితరులు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 8న నూజివీడులో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ కలయిక బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరుకానున్నారని చెప్పారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అక్షరం తప్పన్నా..అవస్థలే!

అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) విద్యార్థుల తల్లిదండ్రులకు చుక్కలు చూపెడుతోంది. ప్రతి విద్యార్థికీ అపార్ సంఖ్యను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అపార్ రిజిస్ట్రేషన్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆధార్ కేంద్రాల చుట్టూ ఉరుకులు, పరుగులు పెట్టిస్తోంది. రెండు నెలలుగా తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆధార్ కార్డులోని పేర్లలో అక్షర దోషాలున్నా, పదాల మధ్య అవసరం లేనిచోట ఖాళీ ఉన్నా, ఖాళీ ఉండాల్సిన చోట లేకపోయినా అపార్ రిజిస్ట్రేషన్ కావడం లేదు. దీంతో ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ, బర్త్ సర్టిఫికెట్‌లో తప్పులుంటే వాటిని సవరించుకునేందుకు మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

- అరకొరగా ఆధార్ కేంద్రాలు
- అపార్ కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ తల్లిదండ్రులు, విద్యార్థుల ప్రదక్షిణ



నూజివీడులో ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నూజివీడు: విద్యాశాఖకు సంబంధించిన యూడైస్‌లో విద్యార్థుల పేర్లు, పుట్టినరోజు, తల్లిదండ్రుల పేర్లు నమోదు చేసి ఉన్నప్పటికీ ఆధార్‌లో, యూడైస్‌లో ఒక్క అక్షరం తప్పు ఉన్నా అపార్ సైట్‌లో విద్యార్థుల వివరాలు నమోదు కావడం లేదు. పుట్టినరోజు యూడైస్‌లో, ఆధార్‌లో ఒకే రకంగా లేకపోయినా అపార్ నమోదు కావడం లేదు. ఆధార్‌లో కేవలం పుట్టిన సంవత్సరం మాత్రమే ఉన్నా అపార్ నంబరు నమోదుకు ఇక్కట్లు తప్పడం లేదు. తెలుగులో కరెక్టుగానే ఉండి ఇంగ్లిష్‌లో ఒక్క అక్షరం తప్పుగా ఉన్నా అపార్ ఆగిపోతోంది. ఇలా అనేక సమస్యలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదో తరగతి విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించి నామినల్ రోల్స్ పంపించాల్సి ఉండటంతో వారు మరింత ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికిప్పుడే ఇది అత్యవసరం అన్నట్లుగా ప్రభుత్వం, విద్యాశాఖ వ్యవహరించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆధార్‌కార్డులోని పేరులో ఎక్కువ అక్షర దోషాలు ఉంటే వాటిని సరిచేసి పంపిస్తున్నా రిజక్ట్ అవుతోందని వాపోతున్నారు.

ఆధార్ కార్డుల్లో అనేక తప్పులు

గతంలో ఆధార్ కార్డులు జారీ చేసే సమయంలో కంప్యూటర్ ఆపరేటర్లు తమ ఇష్టం వచ్చిన విధంగా నమోదు చేయడంతో ఇప్పుడు ఆ తప్పులన్నింటినీ సరిచేసుకోలేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పుట్టినరోజు వివరాలను సంవత్సరం, నెల, తేదీని నమోదు చేయకుండా ఆధార్‌లో కేవలం సంవత్సరం మాత్రమే నమోదు చేయడంతో దానిని కూడా మార్చుకునేందుకు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అరకొరగా ఆధార్ కేంద్రాలు

ఆధార్‌లో తప్పులను సరిచేయించుకోవాల్సిన విద్యార్థులు వేలల్లో ఉండగా, ఆధార్ కేంద్రాలు మాత్రం అరకొరగా ఏర్పాటు చేశారు. ఉన్న అరకొర ఆధార్ కేంద్రాల్లో కూడా పలు చోట్ల సర్వర్ సరిగా పనిచేయడం లేదు. పట్టణంలో లెక్కకు ఆరు ఆధార్ కేంద్రాలుండగా వాటిలో కేవలం పనిచేసేది రెండు కేంద్రాలే. ఈ రెండింటిలో కలిపి రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే ఆధార్ నవీకరణ చేయగలుగుతున్నారు. దీంతో ఆధార్ కేంద్రాల చుట్టూ రోజూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. పట్టణంలోని 9వ సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రంలో ఐరిష్ యంత్రం పనిచేయడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఒక్క అధికారి స్పందించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

వారం నుంచి తిరుగుతున్నా



మా అమ్మాయి పేరు జయశ్రీ, ఆధార్ కార్డులో జయ శ్రీ అని నమోదైంది. అక్షరాల మధ్య ఖాళీ ఉండే సరికి అపార్ నమోదు కావడం లేదు. దీంతో ఖాళీ తొలగించేందుకు ఆధార్ కేంద్రం చుట్టూ వారం రోజులుగా తిరుగుతున్నా . అప్పట్లో ఆపరేటర్లు ఆధార్‌లో ఇష్టారాజ్యంగా నమోదు చేశారు.

– కె. కనకమహాలక్ష్మి, నూజివీడు

ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఇంటి పేరు పొన్నమాలలో రెండు ఎన్‌లకు బదులు ఒక ఎన్ మాత్రమే ఉంది. దీంతో రెండో ఎన్ నమోదు చేయించుకునేందుకు ఆధార్ కేంద్రం చుట్టూ, పుట్టిన రోజు సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ నెలరోజులుగా తిరుగుతున్నా. ఎక్కువ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

– పి దుర్గ, కోటవారిపేట, నూజివీడు

మద్యం దుకాణాలతో శాంతిభద్రతల సమస్య

తిరువూరు వార్డు కౌన్సిలర్ల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

తిరువూరు: కొత్త మద్యం విధానంతో తిరువూరు పట్టణంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల వద్ద శాంతిభద్రతల సమస్య తలెత్తుతోందని, వీటిని ఊరికి దూరంగా తరలించాలని నగర పంచాయతీ కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. శనివారం తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ఆధ్వర్యంలో జరిగింది. 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ మాట్లాడుతూ రద్దీ కూడళ్లలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తుండటంతో నిత్యం మహిళలు, విద్యార్థినులు అసౌకర్యానికి గురవుతున్నందున దూరంగా తరలించాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య పనుల నిర్వహణ ఇలాగేనా?

తిరువూరు పట్టణంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానంగా ఉందని కౌన్సిలర్లు సమావేశంలో ఆందోళన వ్యక్తంచేశారు. ఐదు ట్రాక్టర్లు ఉన్నప్పటికీ వార్డుల్లో 15 రోజులకు ఒకసారి మాత్రమే చెత్త చెదారం సేకరిస్తున్నారని, డ్రెయిన్లలో మురుగు పేరుకుపోయి దోమలు ప్రబలుతున్నాయని కౌన్సిలర్లు షేక్ హుస్సేన్ తదితరులు సమావేశంలో ప్రస్తావించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పెంచి ప్రతి రోజూ చెత్తచెదారం తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నగర పంచాయతీకి చెందిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నందున రక్షణ ఏర్పాట్లు చేయాలని 9వ వార్డు కౌన్సిలర్ మూడు దుర్గా విజ్ఞప్తి చేశారు. నగర పంచాయతీలో శానిటరీ ఇన్‌స్పెక్టరు పోస్టు భర్తీ చేయాలని, దోమల నివారణకు మందు పిచికారీ చేయాలని కోరారు. కుక్కలు, కోతులు, పందుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ కట్టడాలు, ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని 10వ వార్డు కౌన్సిలర్ తంగిరాల వెంకటరెడ్డి కోరారు. తిరువూరు మీదుగా కొత్తగూడెంకు రైలుమార్గం ఏర్పాటుకు ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మానించారు. వైస్ చైర్‌పర్సన్ వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మా వెంకటేశ్వరి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, పరసా సత్యనారాయణ, నదియా, కె. సుందరకుమార్, నిర్మల పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి



చాట్రాయి: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. హరనాథ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సి గుడిపాడులో డిసెంబర్ 4న విజయవాడలో నిర్వహించనున్న ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాఖ జిల్లా కార్యదర్శి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో స్వల్పకాలిక కోర్సులకు సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉచిత శిక్షణను అందించనున్నట్లు కళాశాల ప్రధానాధికారి దేవరకొండ భూషణం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత ఈనెల 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఐటీఐ కళాశాల పని వేళల్లో సంప్రదించాలన్నారు.

మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

ముసునూరు: పచ్చని పల్లెల నుంచి సారా రక్కసి, గంజాయి మహమ్మారిని తరిమివేద్దామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య పిలుపునిచ్చారు. వేల్పుచర్లలో ఎక్సైజ్ శాఖ సర్కిల్ టీమ్ ఆధ్వర్యంలో సారా తయారీ నిరోధం, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ, చైతన్య సదస్సు శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారీదారులు, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తరలిస్తూ జేబులు నింపుకుంటున్న అక్రమార్కుల నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్ఐలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్ కాలుష్యంపై స్పందించిన ఎన్జీటీ

విచారణకు స్వీకరణ

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై పలు ప్రజా సంఘాలు చేపట్టిన ఉద్యమాలు, వివిధ వార్తా పత్రికల కథనాలకు స్పందించిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) స్వచ్ఛందంగా విచారణకు స్వీకరించిందని రైతు సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి చెరుకూరి వేణుగోపాల్ శనివారం తెలిపారు. ఎన్జీటీ చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, జస్టిస్ సింథల్‌వేల్‌తో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది. కాలుష్య నియంత్రణ చట్టం, పర్యావరణ పరిరక్షణ చట్టం నియమ నిబంధనలు ఎన్టీటీపీఎస్ ఉల్లంఘించినట్లు ఎన్జీటీ గుర్తించిందన్నారు. ఈ అంశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, కేంద్ర కాలుష్య నియంత్రణ మండళ్లు, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, జిల్లా మెజిస్ట్రేట్ వారిని ప్రతివాదులుగా ట్రిబ్యునల్ చేర్చింది. తదుపరి విచారణ తేదీకి ఒక వారం రోజుల ముందు ట్రిబ్యునల్‌లోని సదరన్ జోనల్ బెంచి ముందు తమ స్పందన, ప్రత్యుత్తరాలు అఫిడవిట్ ద్వారా దాఖలు చేయాలని ఎన్జీటీ ఆదేశించింది. తదుపరి చర్యల కోసం దరఖాస్తును చెన్నైలోని దక్షిణ జోనల్ బెంచ్‌కు బదిలీ చేసింది. వచ్చే జనవరి 10న విచారణకు వాయిదా వేసినట్లు వేణుగోపాల్ తెలిపారు.

80 శాతం పింఛన్ల పంపిణీ

తిరువూరురూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. 6,777 పెన్షన్లకు గాను 4,500 పెన్షన్లను పంపిణీ చేశామని మండల పరిషత్ అధికారులు తెలిపారు. ఎంపీడీఓ రవిబాబు పర్యవేక్షించారు.

రోడ్డుపై పింఛన్ల పంపిణీ

జి.కొండూరు: ఇళ్లకు వస్తే సర్వర్ పనిచేయడం లేదంటూ పింఛన్ లబ్ధిదారులంతా ఒక చోటికి వస్తే ఇస్తామంటూ సచివాలయ ఉద్యోగి హుకుం జారీ చేశారు. దీంతో జి.కొండూరు మండల పరిధి మునగపాడు గ్రామంలో వృద్ధులు, దివ్యాంగులు రోడ్డు పైకి వచ్చి పింఛన్ తీసుకున్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెల్లవారు జామున గ్రామ వలంటీర్లు ఇంటికి వచ్చి నిద్ర లేపి పింఛన్ ఇచ్చారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో వలంటీర్లను తొలగించడం వల్లే తమకు ఈ కష్టాలు వచ్చాయని లబ్ధిదారులు వాపోయారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



దేవ సహాయం దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు, ప్రజాప్రతినిధులు

విస్సన్నపేట: అంకిత భావంతో పనిచేసిన సిబ్బందికి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అన్నారు. గత 26 ఏళ్లుగా అంకిత భావంతో పని చేసి వృత్తినే దైవంగా భావించి విధి నిర్వహణలో అందరి మన్ననలు పొంది ఉద్యోగ విరమణ చేస్తున్న పంచాయతీ రాజ్ ఏఈ పాపట్ల దేవ సహాయం ఆదర్శనీయుడని అన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ దేవ సహాయం ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించారు. సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, పీఆర్ డీఈ లక్ష్మణరావు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

'చింతలపూడి'ని వేగంగా పూర్తి చేస్తాం



వేల్పుచర్లలో పింఛను అందజేస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు: చింతల పూడి ఎత్తిపోతల పథకాన్ని రానున్న ఐదేళ్లలో పూర్తి చేస్తామని, అర్హులైన పేదలకు ఇళ్లు కట్టిస్తామని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కె. పార్థసారథి అన్నారు. మండలంలోని వేల్పుచర్లలో శనివారం పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూజివీడు ప్రాంతానికి అత్యవసరమైన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి మండల ప్రజల సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. మండలంలో 7,874 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.3,30,75,500, వేల్పుచర్లలో 759 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.32,17,000 పంపిణీ చేశామని ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజ్‌కుమార్, డీఎల్పీఓ సుందరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి



పెనుగొలనులో నివాళులర్పిస్తున్న విద్యార్థులు



కొండపల్లిలో నివాళులర్పిస్తున్న జేవీవీ సభ్యులు



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

లక్ష్మీపురం(తిరువూరురూరల్): అభ్యుదయ కవితా పితామహుడు, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో శనివారం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. హరికృష్ణ తన రచనల ద్వారా వాడుక భాష వ్యాప్తికి, సమాజంలో నెలకొన్న రుగ్మతలు రూపుమాపేందుకు గురజాడ చేసిన కృషి మరువలేనిదన్నారు. బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి నాటకాలు రచించిన గురజాడ సామాజిక చైతన్యానికి నాంది పలికారని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కొండపల్లి నాగార్జున హైస్కూల్‌లో గురజాడ అప్పారావు చిత్రపటానికి జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, కొండపల్లి శాఖ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. కామేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు గురజాడ అప్పారావు ఎంతగానో కృషి చేశారని చెప్పారు. పట్టణ అధ్యక్షుడు ఎస్.నాగరాజు, కార్యదర్శి సర్దార్ సీహెచ్, న్యాయవాది యల్లమందయ్య, చేతన్ మురళి పాల్గొన్నారు.
- **పెనుగొలను(గంపలగూడెం):** పెనుగొలను ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ గురజాడ సేవలను కొనియాడారు. గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకానికి సాహితీలోకంలో ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీ నరసింహారావు, సాయిబాబా కమిటీ సభ్యులు వెదురు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీతో ఒప్పందంపై నిలదీత

- కౌన్సిల్‌కు తెలియకుండా నిర్ణయాలు తీసుకోవడంపై అసహనం
- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాడీవేడిగా చర్చ



వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ

నూజివీడు: ట్రిపుల్ ఐటీలోని ఫుడ్ కోర్టుతో పాటు 9 షాపుల నిర్వహణకు సంబంధించి పట్టణ సమాఖ్య (టీఎల్ఎఫ్), కమిషనర్ కలిసి ఆర్జీయూకేటీతో మున్సిపల్ కౌన్సిల్‌కు సంబంధం లేకుండా ఒప్పందం ఎలా చేసుకున్నారని కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. ఒప్పందం చేసుకునేందుకు కమిషనర్‌కు అధికారం ఎక్కడిదని వారు ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. 32వ వార్డు కౌన్సిలర్ నొడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ టీఎల్ఎఫ్‌కు ట్రిపుల్ ఐటీలో ఫుడ్‌కోర్టుతో పాటు పలు షాపులను కేటాయించారని, దానికి సంబంధించి మున్సిపల్ కౌన్సిల్‌కు తెలియజేయాల్సిన పనిలేదా అని ప్రశ్నించారు. దీనికి ఇన్‌చార్జి సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం) లటికే నాగోజీ బదులిస్తూ ట్రైపార్టీ ఒప్పందం కుదుర్చుకోగా ట్రిపుల్ ఐటీలోని రెండు ఫుడ్ కోర్టులను, 9 షాపులను కేటాయించారని, వాటిని తాము నిర్వహించలేమనే ఉద్దేశంతో 0.5 శాతం కమీషన్ ఇచ్చే ఒప్పందంతో టీఎల్ఎఫ్ వాటిని వేరే వారికి ఇచ్చిందన్నారు. గతంలో పీడీగా పని చేసి, ఇప్పుడు మంత్రి ఓఎస్డీగా పనిచేస్తున్న ప్రకాశరావు ఒప్పందం చేసుకోవచ్చని చెప్పారని సీఎంఎం పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్‌కు సంబంధం లేకుండా ఇష్టం వచ్చినట్లు ఎంఓయూలు ఎలా కుదుర్చుకుంటారని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఎంప్లాయీస్ కాలనీలో కేంద్రీయ విద్యాలయానికి ఉద్దేశించిన భవనంలో ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేయాలనే అంశాన్ని పక్కన పెట్టాలని కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ చెప్పారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్ చెరుకూరి దుర్గాప్రసాద్‌కు, పగడాలకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. తాను పలు అంశాలను కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఇచ్చినప్పటికీ అజెండాలో ఒక్కటి కూడా పెట్టలేదని వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు అధికారులను నిలదీశారు. సమావేశంలో డీఈ కె. వెంకట్రావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ



ఖైదీల భోజనానికి ఉపయోగించే సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న జడ్జి నాగశైలజ

నూజివీడు: రిమాండ్ ఖైదీలకు న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేకపోతే న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తోందని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. పట్టణంలోని సబ్‌జైలును శనివారం అదనపు జిల్లా జడ్జి ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఖైదీలకు ఆహారం నిమిత్తం ఉపయోగిస్తున్న సరుకులను, కూరగాయలను పరిశీలించారు. ఆహారం నాణ్యతగా ఉంటుందా లేదా అని రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఎవరైనా బాధపడుతుంటే వెంటనే తెలియజేయాలన్నారు. వారికి కల్పిస్తున్న సదుపాయాలపై రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివపార్వతి, సబ్ జైలు సూపరింటెండెంట్ గంగినేని ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు

జడ్జి మోతీలాల్



మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్

గంపలగూడెం: సమాజంలో బాల్య వివాహాలు కొనసాగితే మానవాళికి నష్టం చేకూరుతుందని తిరువూరు ప్రిన్సిపల్ సివిల్ జూనియర్ జడ్జి మోతీలాల్ అన్నారు. తోటమూల ఏపీ మోడల్ స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. జడ్జి మోతీలాల్ మాట్లాడుతూ యుక్త వయస్సు రాకుండా చిన్నవయసులోనే వివాహం చేస్తే పుట్టే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉండకపోగా, తల్లిదండ్రులకు అనేక నష్టాలు వాటిల్లుతాయని చెప్పారు. 14 సంవత్సరాలు నిండే వరకు కచ్చితంగా చదువుకుని తమ జీవితాలకు మంచి మార్గం ఏర్పరచుకోవాలని సూచించారు. పిల్లలు బడికి కాకుండా పనికి వెళ్లడం చట్టరీత్యా నేరం అవుతుందన్నారు. పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ బాల్య వివాహాలు, అక్షరాస్యత, వెట్టిచాకిరీ తదితర అంశాలను వివరించారు. ఎస్ఐ ఎస్. శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

ఆగిరిపల్లి: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డెప్యూటీ తహసీల్దారు పవన్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో ఆనంద మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. హ్యూమన్‌రైట్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రత్తిపాటి సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ కూరపాటి యోహాను, ఎంపీహెచ్ ఓ రత్నబాబు, ఆనంద మహిళా మండలి అధ్యక్షురాలు సంధ్య, విజయనిర్మల, నాని పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com